# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 153 క్రిష్ణా, శుక్రవారం 27- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలే లక్ష్యం



**అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** ఐదేళ్లలో ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో ఒప్పందాలు చేసుకున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20నెలల్లో 1.09లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఉద్దేశించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు అందిస్తున్నాయా.? అంటూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు బుధవారం అసెంబ్లీలో మంత్రి సమాధానం ఇచ్చారు. క్లస్టర్ విధానంలో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే 760ప్రాజెక్టులు గుర్తించామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి ఉద్యోగ మేళా నిర్వహించబోతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1,587నిర్వహించామన్నారు. ఇందులో 11,373పరిశ్రమలు పాల్గొని 1.09లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చాయని లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో నైపుణ్య పోర్టల్ ప్రారంభిస్తామన్న మంత్రి... స్కిల్ సెన్సెస్ చేద్దామనుకుంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందుకే ఏఐ ద్వారా స్కిల్ అసెస్మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఎలక్ట్రికల్, ప్లంబర్ వర్కర్స్ సహా ఇతరులు ఎవరికివారే యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. వారికి తగిన శిక్షణ ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పిన వైసీపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత మడమ తిప్పిందన్నారు. అప్పటికే ఉన్న స్కిల్ కార్పొరేషన్ ఉద్యోగుల్ని వైసీపీ నేతలు ఇళ్లల్లో పనికి పెట్టుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ ముఖ్యమని భావించిన తాము ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు.రాత్రింబవళ్లు అభివృద్ధి పనులు జరుగుతున్న రాజధాని ప్రాంతంలోని అన్ని పోలీసు స్టేషన్లలోనూ సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ చెప్పారు. పోలీసు స్టేషన్‌కు ఎవరు.. ఎప్పుడు వెళ్లినా బందోబస్తు డ్యూటీల్లో ఉన్నారని సమాధానం వస్తోందని, ఈ విషయం డీజీపీకి చెప్పినా ఫలితం లేదని ఎమ్మెల్యే పెదవి విరిచారు. ఈ సమస్య అందరి వద్దా ఉంది.. మీరు మాట్లాడతారా.. అంటూ డిప్యూటీ స్పీకర్ హోం మంత్రి అనితను అడగ్గా ఆమె తల అడ్డంగా ఊపారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కొవ్వాడలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు భూములిచ్చిన నిర్వాసితులకు అటు పునరావాస కాలనీ పూర్తిచెయ్యక, ఇటు ఉన్నచోట కనీస సౌకర్యాల్లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని అడిగితే.. ఎలాగూ ఆర్.ఆర్. కాలనీకి మారుతారు కదా.? అనే సమాధానం వస్తోందని, అది పూర్తయ్యేవరకూ ఆ ప్రజలు శిక్ష అనుభవించాల్సిందేనా.? అని ప్రశ్నించారు. ఎచ్చెర్ల ప్రాంతంలోని పారిశ్రామిక వ్యర్థాలతో అక్కడి మత్స్యకారులు మత్స్య సంపద కోల్పోయి ఉపాధికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

'మదనపల్లె ఫైల్స్ తరహాలోనే సర్వేపల్లి ఫైల్స్ ఉన్నాయి.. వందల కోట్ల విలువైన భూముల స్కామ్ వైసీపీ హయాంలో జరిగింది. ప్రభుత్వం ఖరీదైన భూముల్ని కాపాడుకోవాలి. విచారించి చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు.

పేదలకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యంలో 80శాతానికి పైగా దారి మళ్లుతున్నాయని, ప్రభుత్వానికి ఆర్థిక భారమైన ఈ సరఫరాపై సమీక్షించి సముచిత నిర్ణయం తీసుకోవాలని పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి కోరారు.

## ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ..



# పోలవరం-నల్లమల అనుసంధానంతో రెండు రాష్ట్రాలకూ లాభమేనన్న సీఎం చంద్రబాబు

**అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** పోలవరం–నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 2014–19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు.గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం



శంకుస్థాపన చేసిన ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు. తాను చేయని తప్పుకు 53 రోజులు జైల్లో పెట్టారని, అయినా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, కొందరు కేవలం రాజకీయం కోసమే నీటి సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళతామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## ఏపీ శాసనసభలో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం



**అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టసవరణ చేశామని.. హరిత ఇంధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కర్బన ఉద్గారాలు సున్నాకు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో ఇలాంటి ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు తీసుకోవడం సాధ్యమయ్యేది కాదని, చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములు లీజుకు ఇచ్చే వెసులుబాటు కలుగుతోందని మంత్రి తెలిపారు. తద్వారా అసైన్డ్ భూముల యజమానులకు అద్దె రూపంలో ఆదాయం వస్తుందన్నారు. రెండేళ్లకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వాలు కలిపి 35 లక్షల ఎకరాల భూములను అసైన్డ్ చేశాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు చాలా చోట్ల చేతులు మారాయని.. పేదల నుంచి భూములు తీసుకున్నవారు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అసలు లబ్ధిదారులకే లీజు డబ్బు అందేలా చూడాలని సూచించారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారని, అలాంటి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో భూముల ఫ్రీ–హోల్డ్‌లో కుంభకోణం జరిగిందని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు.

## కొత్త చట్టం.. ఇకపై గ్రామ, వార్డు సచివాలయాలను ఎలా పిలుస్తారంటే

**అమరావతి, క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** ఏపీ శాసనసభలో గ్రామ, వార్డు సచివాలయాల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా పిలుస్తారు. గురువారం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ విజన్‌కు అనుగుణంగా సచివాలయాల విధుల్లో మార్పులు చేశామని మంత్రి వివరించారు. అందుకు తగినట్లుగా సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మారుస్తూ చట్ట సవరణను ప్రతిపాదించినట్లు తెలిపారు.దీనిపై ఈ ఏడాది జనవరిలో గవర్నర్ గెజిట్ ద్వారా ఆర్డినెన్స్ జారీ చేశారన్నారు మంత్రి. సచివాలయాలు చాలా చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, ప్రభుత్వ భవనాలున్న చోటికి వాటిని మారుస్తున్నామని మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తామని, అన్ని విభాగాల్లో సిబ్బందికి పదోన్నతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని గవర్నింగ్ బాడీగా నియమించామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుందన్నారు. స్వర్ణ




గ్రామాలు, స్వర్ణ వార్డుల పేర్లు ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తాయని అన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉండటంతో అక్కడి సిబ్బందిలో హార్టికల్చర్ నిపుణులను నియమించవచ్చని సూచించారు. అభివృద్ధికి అసలైన చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నారు. సంపద సృష్టించే క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు.

## ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: జాతీయ విద్యాపరిశోధన–శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారట. ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. 'వీటన్నింటినీ ఎవరు పర్యవేక్షిస్తున్నారు?.. బాధ్యులను గుర్తించారా? ' అని మోదీ ప్రశ్నించారటఇక, ఈ విషయంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మేము న్యాయ వ్యవస్థకు అత్యున్నత స్థానం ఇచ్చాం. న్యాయ వ్యవస్థను కించపరచాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఇసుమంత కూడా లేదు. మేము ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాము. న్యాయ వ్యవస్థ తీసుకున్న నిర్ణయంతో ఏకీభవిస్తున్నాము. జరిగిన దానికి నేను ఎంతో చింతిస్తున్నా' అని అన్నారు.

సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం..

ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది జ్యుడీషియరీపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించనని తేల్చిచెప్పారు. బుక్‌పై నిషేధం విధించారు. అన్ని కాపీలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. ఆన్‌లైన్ ద్వారా పుస్తకం మొత్తం లేదా దాని భాగాలను షేర్ చేయటంపై కూడా చీఫ్ జస్టిస్ నిషేధం విధించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌సీఈఆర్‌టీ ఛైర్మన్‌కు నోటీసులు జారీ చేసింది.

# పెసర పంటకు కష్టకాలం !

**ఇంకా ఏర్పాటు చేయని మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు**
**చీడపీడలతో తగ్గిన పంట దిగుబడి**
**ఆందోళనలో రైతులు**



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** గోదావరి, కృష్ణా కాల్వల కింద రెండో పంటగా సాగుచేసిన పెసల పంటకు కష్ట కాలమొచ్చింది. ఈ ఏడాది పంటకు చీడపీడల తాకిడితో పాటు దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే కాలం సమీపిస్తున్నప్పటికీ ఇంకా వీటిని కొనుగోలు చేయడానికి మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా 30 శాతం పైబడి పంట కోతలు పూర్తయ్యాయి. ఆరుగాలం పండించిన పెసలను రైతులు ఒబ్బిడి చేసుకుని.. నూర్పిడి చే యడానికి సర్వం సన్నద్ధం అవుతున్నారు. దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్, పెదవేగి, భీమడోలు, ఉంగుటూరుల్లో ఐదు వేల ఎకరాల పైబడి ఈ ఏడాది పెసలు పంటను రైతులు సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో దిగుబడి తగ్గి దిగులు చెందుతున్నారు.

'మొంథా'తో దెబ్బతిన్న రైతు..

గతేడాది తుఫాన్‌ల తాకిడితోపాటు మొంథా తీవ్రంగా వరి రైతులను దెబ్బతీసింది. ఆ పంట చాలా వరకు పోయినప్పటికి.. రెండో పంటలోనైనా అతి తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు వచ్చే పెసల పంటపై రైతులు ఆసక్తి కనబర్చారు. ఈ పంటకు రైతులందరూ గ్రామాల్లోని పెట్టుబడిదారులైన పురుగుమందు వ్యాపారులను ఆశ్రయించారు. వ్యవసాయశాఖ ధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. తగిన సూచనలు, సలహాలు ఇచ్చే వారు లేకుండాపోయారు. పెట్టుబడి ఇచ్చేది పురుగుమందు వ్యాపారులే కావడంతో పంట కాలం పూర్తయే సమయానికి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసే పురుగుమందులను వ్యాపారుల లాభాల కోసం రైతులతో నాణ్యమైనవంటూ చెప్పి మందులు అంటకట్టి ఎక్కువ ధర గల పురుగుమందులను నాలుగు లేక ఐదు సార్లు పెసల పంటలకు పిచికారీ చేయించారు. మొదట్లో పంట బాగా ఉన్నప్పటికి పంట చేతికొచ్చే సరికి పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. చివరకు ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు పంట దిగుబడి రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

కొనుగోలు కేంద్రాలెక్కడ ?

ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. రైతులు 30 శాతం నియోజకవర్గంలో పెసల కోతలు పూర్తైన నేపథ్యంలో ఆ పంటలను క్వింటా రూ.7వేలకు పెట్టుబడి పెట్టిన పురుగుమందుల యజమానులే కొనుగోలు చేస్తామని ముందుకొస్తున్నారు. పెట్టుబడి తీసుకుని ఉండడం.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయకపోవడంతో ఏమి చేయాలో తెలియని అయోమయస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాకు మద్దతు ధర రూ.8,600కు ఇచ్చి పెసలను కొనుగోలు చేసింది. ఇప్పుడా ఆ పరిస్థితి లేక రైతులు ఎవరిని ఆశ్రయించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారో ? అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా పంట కోతలు పూర్తయిన చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా ప్రజాప్రతి నిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వరి పంట తీవ్ర నష్టాలను మిగిల్చింది. పెసల పంట లాభం వస్తుందనుకుని ఎనిమిది ఎకరాల పొలంలో సాగుచేస్తే చీడ,పీడల వల్ల అనుకున్నస్థాయిలో పంట చేతికి రాలేదు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో చాలాతక్కువ ధరకు పంటలను దళారులు అడుగుతున్నారు. సత్వరమే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తెరిచి ఆదుకోవాలి

బలుసు రామచంద్రరావు రైతు, దెందులూరు

ఎకరాకు రూ.7 వేలు నష్టం

దెందులూరు గ్రామ సరిహద్దులోని సత్యనారాయణపురం పరిధిలో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని పెసల పంటను సాగు చేశా. ఎకరానికి మూడు క్వింటాళ్ల చొప్పున పంట దిగుబడి వచ్చింది. తీరా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు క్వింటా రూ.7 వేలకే ఇవ్వమంటున్నారు. దీనివల్ల ఎకరాకు రూ. నష్టపోతున్నా.

# పారిశ్రామిక రంగం పరుగులు

**అచ్యుతాపురం సెజ్‌లో పెట్టుబడుల వెల్లువ**
**రూ.48 వేల కోట్ల పెట్టుబడులు**
**ఇప్పటికే పనులు ప్రారంభించిన పలు కంపెనీలు**
**రూ.2,300 కోట్లతో బ్లూ జెట్ హెల్త్ కేర్ ఫార్మా**
**శంకుస్థాపన రేపు**
**హాజరు కానున్న మంత్రి నారా లోకేశ్**

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** అనకాపల్లి– కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలతో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా అచ్యుతాపురం గుర్తింపు పొందింది. ఇప్పుడు రాంబిల్లి మండలానికి పరిశ్రమల రాక ప్రారంభమైంది. ఈ మేరకు అవసరమైన భూముల ఎంపిక, మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులు దృష్టిసారించారు. ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ లైన్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేశారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్‌లో రూ.5,630 కోట్లతో లారస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో భారీ ఫార్మా జోన్‌ను అభివృద్ధి చేశారు. ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. దీని ద్వారా 6,350 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. అలాగే రూ.11 వేల కోట్ల అంచనా వ్యయంతో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుకాబోతోంది. ఈ కంపెనీలో 1,500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఇంకా రూ.2,700 కోట్లతో ఏర్పాటుచేయనున్న జూపిటర్ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ కేంద్రానికి ప్రభుత్వం భూమి కేటాయించింది. రూ.3,990 కోట్లతో రెన్యూ ఫోటో వాల్టాయిక్స్ కంపెనీ సోలార్ ప్రాజెక్టు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. వీటితో పాటు ఇదే సెజ్‌లో అదానీ డేటా సెంటర్ ఏర్పాటు కానున్నది. దీంతోపాటు లిథియం, ఐయాన్ బ్యాటరీ గిగా ఫ్యాక్టరీకి ప్రభుత్వం భూమి కేటాయించింది. సుమారు రూ.8,175 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమ ద్వారా మూడు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

రూ.2,300 కోట్లతో బ్లూ జెట్ హెల్త్‌కేర్ ఫార్మా....

ప్రముఖ ఫార్మా సంస్థ 'బ్లూజెట్ హెల్త్‌కేర్' 102.48 ఎకరాల్లో ఫార్మాస్యూటికల్, ఇంటర్మీడియట్, కాంట్రాక్టు డెవలప్‌మెంట్ తయారీ యూనిట్ ఏర్పాటుచేయనున్నది.



అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్‌లో ఈ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే భూమి కేటాయించింది. ఫేజ్–1 పనులను రూ.1,260 కోట్లతో 2027 జూలై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫేజ్–2, ఫేజ్–3 కింద మిగిలిన పనులు 2031 అక్టోబరు నాటికి పూర్తిచేస్తుంది. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 1,750 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. బ్లూ జెట్ హెల్త్ కేర్ కంపెనీకి శనివారం రాష్ట్ర విద్యా, ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ రాంబిల్లిలో భూమి పూజ చేయనున్నారు.

ఎంఎస్ఎంఈ పార్కులు

అచ్యుతాపురం, రాంబిల్లి పారిశ్రామిక ప్రాంతంలో అనేక చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సెజ్‌లో ప్లాట్‌లు కొనుగోలు చేసి, ఫార్మా, ఇతరత్రా పరిశ్రమలకు అనుబంధంగా చిన్న, మధ్యతరగతి యూనిట్లను ఏర్పాటుచేస్తున్నారు. సెజ్‌లో ఆరు ఎంఎస్ఎంఈలు ప్రారంభమైనట్టు అధికారులు చెబుతున్నారు. ఇంకా మరికొన్ని ఇక్కడ ఏర్పాటు కానున్నాయి.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం

విజయకృష్ణన్, కలెక్టర్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా నక్కపల్లిలో మిట్టల్ స్టీల్, బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. అచ్యుతాపురం సెజ్‌లో రెండేళ్లలో సుమారు రూ.40 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం భూములు కేటాయించింది. కొన్ని పరిశ్రమల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# గాడితప్పిన సచివాలయ వ్యవస్థ

**ప్రక్షాళన చేసినా.. మెరుగుపడని వైనం**
**కొంతమంది ఉద్యోగులపై అధిక పనిభారం**
**మరికొందరికి అరకొర పనులు**
**డిప్యూటేషన్‌పై సర్వేయర్లు, వీఆర్‌వోలు**
**ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోల ఆదేశాలు బేఖాతరు**




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26:** గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినప్పటికీ సంపూర్ణంగా గాడినపడలేదు. సచివాలయాలపై పర్యవేక్షణను మరింత పెంచాల్సిన అవసరం ఉందని, అప్పుడే సిబ్బంది సక్రమగా విధులు నిర్వహిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని స్పష్టమవుతున్నది. సచివాలయ సిబ్బందిలో డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు పనిభారం అధికంగా వుండగా, ఏఎన్ఎం, వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శికి మోస్తరుగా, మహిళా పోలీస్, వ్యవసాయ/ఉద్యానవన, వెటర్నరీ అసిస్టెంట్‌లకు తక్కువగా పనులు ఉంటున్నాయని అంటున్నారు. మరోవైపు సర్వేయర్లు, వీఆర్‌వోలను మండల, డివిజన్ కార్యాలయాలకు డిప్యూటేషన్లపై వేసి అక్కడ పనులు చేయించుకుంటున్నారు. జిల్లా కేంద్రం పాడేరులోని మూడు సచివాలయాలకు చెందిన సర్వేయర్లు, వీఆర్‌వోలను ఇతర కార్యాలయాలకు పంపడం ఇందుకు ఒక ఉదాహరణ. అలాగే మహిళా పోలీసులు సచివాలయాల్లో ఉంటుండగా, వ్యవసాయ/ఉద్యానవన అసిస్టెంట్‌లు ఫీల్డ్ వర్క్ పేరిట బయటే ఉంటున్నారు. ఎప్పుడు సచివాలయానికి వెళ్లినా డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు మినహా మిగిలిన సిబ్బంది కనిపించడంలేదు.

జిల్లాలో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 212 గ్రామ సచివాలయాలు వున్నాయి. వివిధ కారణాల వల్ల వీటి పర్యవేక్షణ అధికారులకు ఒక సవాల్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయాలు నవరత్నాల అమలుకు మాత్రమే పరిమితం కాగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అనేక పనులను అప్పగిస్తున్నారు. దీంతో ఆయా పనులు సకాలంలో సక్రమంగా జరగని పరిస్థితి నెలకొందని మండల, డివిజన్, జిలాస్థాయి అధికారులు అంటున్నారు. సచివాలయ స్థాయిలో జరగాల్సిన ఏకీకృత కుటుంబ సర్వే, సిటిజన్ ఈ–కేవైసీ, వాట్సాప్ గవర్నెన్స్, తదితర అంశాల్లో జిల్లా వెనుకబడుతున్నది. సచివాలయ స్థాయి పనులు వేగవంతం కాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతున్నదని కలెక్టర్ స్థాయి అధికారులు సైతం పేర్కొంటున్నారు. అలాగే మండల స్థాయిలో ఉండే ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోల మాటను సచివాలయ సిబ్బంది వినడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపీడీవోలు పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు కావడం, సచివాలయాలు స్వర్ణ గ్రామ శాఖకు చెందినవి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సచివాలయ వ్యవస్థను పర్యవేక్షించేందుకు గత ఏడాది డిసెంబరులో ప్రత్యేకంగా నియమించిన డిప్యూటీ ఎంపీడీవోల పరిస్థితి కూడా అలాగే ఉంది. వీరికి ఎంపీడీవో కార్యాలయాల్లో కనీసం కోర్చోడానికి కుర్చీలేని దుస్థితి. పర్యవేక్షణ, డేటా ఆన్‌లైన్, ఇతర పనులు చేపట్టేందుకు సదుపాయాలు లేని పరిస్థితి నెలకొంది. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు వేర్వేరు శాఖలకు చెందిన అధికారులు కావడంతోనే ఈ సమస్య నెలకొందని అంటున్నారు. ఈ కారణంగానే సచివాలయాల సిబ్బంది, వీరిని లెక్కచేయడం లేదని అంటున్నారు.కలెక్టర్ హెచ్చరికలు జిల్లాలో సచివాలయాల సిబ్బంది పనితీరు, అధికారుల పర్యవేక్షణపై కలెక్టర్ దినేశ్‌కుమార్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల సచివాలయ వ్యవస్థపై అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో విధులకు గౌర్హాజరవుతున్న సచివాలయ సిబ్బందిపై చర్యల్లోభాగంగా వారి హాజరు ఆధారంగా జీతాలను చెల్లించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయాలను పక్కాగా పర్యవేక్షించాలని, ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

**క్రైం కౌంటర్ న్యూస్,** కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 26: తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దని నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వ నాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాల యంలో ఇంజనీరింగ్ విభాగ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిం చాలన్నారు. అతిసారం ప్రబలకుండ ముందస్తు చర్యలు తీసుకోవాల న్నారు. ప్రతిరోజు ఉదయం అన్ని సచివాల యాల పరిధిలో అమ్యూనిటీస్ కార్యదర్శులు, తాగునీటి సరఫరా సిబ్బంది సంయుక్తంగా క్లోరిన పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒక్కసారి తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. పైప్‌లైన లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. డ్రైనేజీల్లో ఉన్న పైప్‌లైన్ల తొలగింపులో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. తాగునీటి కొళాయి చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు.



సమావేశంలో ఎస్ఈ జే.రమణ మూర్తి, ఎంఈ మనోహర్‌రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు నరేష్, క్రిష్ణలత, పవనకుమార్‌రెడ్డి, శ్రీనివాసన, సూపరింటెండెంట్ మంజూర్ బాషా, ఏఈలు జనార్ధన, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వైష్ణవి, ఖాసీం, మహేష్ పాల్గొన్నారు.

# మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'

**ఫొటోలకే పరిమితమవుతున్న అధికారులు**

**- రైతులకు సలహాలు, సూచనలు అంతంతే**

**- శాఖల మధ్య సమన్వయ లోపం**



క్రైం కౌంటర్ న్యూస్, పార్వతీపురం, ఫిబ్రవరి 26 జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. 14 శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు తప్ప మిగతా వారు హాజరుకావడం లేదు. వ్యవసాయ అధికారులు కూడా పొలాలకు వెళ్లి అక్కడ ఉన్న రైతులతో ఫొటోలు తీసుకోవడానికే పరిమితవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతులకు సాగుపై అవగాహన కల్పించడం గానీ, సూచనలు, సలహాలు ఇవ్వడం గానీ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 2.62లక్షల ఎకరాల్లో, రబీ సీజన్‌లో 75వేల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగుచేస్తుంటారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, రాగులు, ఉలవలు, పెసర, మినుము, చెరకు, నువ్వులు, కూరగాయలు వంటివి పండిస్తుంటారు. అయితే, ప్రతి సంవత్సరం వాతావరణ ప్రతికూల పరిస్థితులు, చీడపీడలు, తెగుళ్లతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంటుంది. సరైన సాగు సలహాలు లేక ఏటా రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి 2024 సెప్టెంబరు 10న శ్రీకారం చుట్టింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పట్టు పరిశ్రమ, సేంద్రియ, మార్కెటింగ్ శాఖ అధికారులను పొలంబాట పట్టాలని ఆదేశించింది. వీరంతా రైతులతో సమావేశాలు కావాలి. వారికి సరైన సాగు సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఖరీఫ్, రబీలో చెరో నాలుగు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించింది. ప్రతి మంగళ, బుధవారాల్లో విధిగా నిర్వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. అయితే, జిల్లాలో ఈ ఏడాదిన్నరలో అధికారులు కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖతో పాటు దాని అనుబంధ శాఖలు కూడా తప్పనిసరిగా పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉంది. కానీ, మార్కెటింగ్, మత్స్యశాఖ, పట్టుపరిశ్రమ శాఖ, సేంద్రియ తదితర శాఖల అధికారులు అనేక మండలాల్లో జరుగుతున్న కార్యక్రమాలకు హాజరుకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనివల్ల ఆయా శాఖల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందడం లేదు.

జిల్లాకు పూర్తిస్థాయి వ్యవసాయాధికారి లేరు. గతంలో పనిచేసిన రాబర్ట్‌పాల్ పదోన్నతిపై వెళ్లిపోయారు. దీంతో గత ఏడాది ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారిగా అన్నపూర్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈమె ప్రస్తుతం సెలవులో ఉన్నారు. సాలూరు ఏడీ జి.సత్యవతి ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా వ్యవహరిస్తున్నారు

విజయవంతంగా నిర్వహిస్తున్నాం

జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. కొన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకావడం లేదు. అయినప్పటికీ వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అన్ని సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

## గోదావరి పుష్కరాలపై ఏపీ క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు..

క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 26 ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన 2027 గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ ఇవాళ(గురువారం) సచివాలయం 5వ బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో భేటీ అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. గత భేటీలోని అంశాలు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితర అంశాలపై చర్చించింది. మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ భావించింది. 8 నుంచి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని క్యాబినెట్ సబ్ కమిటీ అంచనా వేస్తోంది. 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలకు అంచనా వేసింది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో(తొలి, వీకెండ్, అమావాస్య) దాదాపు కోటి మంది వస్తారని అంచనా వేసింది. పవిత్ర స్నానానికి 2.25 కోట్ల మంది వస్తారని అంచనా వేసింది. భక్తుల సౌకర్యార్థం పిండ ప్రదానం ఘాట్లు, శానిటేషన్ ప్రక్రియ, రోడ్లు, వాటర్ తదితర విషయాల్లో పక్కా ప్రణాళిక ఉండాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు



పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌తో క్యాబినెట్ సభ కమిటీ చర్చించింది. ఈస్ట్ గోదావరిలో 102 ఘాట్లు, వెస్ట్ గోదావరి 40, కోనసీమ 175, ఏలూరు 36, కాకినాడ 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు.. మొత్తంగా 369 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఏపీలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలో గుండాల, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ అని కమిటీ వెల్లడించింది. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయం తీసుకుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

# న్యాయవ్యవస్థలో అవినీతి పేరిట పాఠ్యాంశం! ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌పై సుప్రీం కోర్టు నిషేధం



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 26: ఇంటర్నెట్ డెస్క్: 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని 8వ తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో చేర్చడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్‌టీ బాధ్యతవహించాల్సిందేనని స్పష్టం చేసింది. 'మరింత లోతైన విచారణ జరగాలి. బాధ్యులు ఎవరో తేలాలి. వారు మూల్యం చెల్లించుకోవాల్సిందే. కేసును మేము క్లోజ్ చేయము" సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాకుండా, భారత్‌తో పాటు విదేశాల్లోనూ ఆ పుస్తకాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రతులను వెంటనే సీజ్ చేయాలని పేర్కొంది. ఆన్‌లైన్‌లో కూడా ఆ పుస్తకాన్ని విక్రయించడంపై నిషేధించింది. అటు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్‌కూ నోటీసులు జారీ చేసింది. అంతకుముందు, సొలిసిటర్ జనరల్ తన వాదనలు వినిపిస్తూ ఈ ఉదంతానికి బాధ్యులైన వారు ఇకపై ఎన్‌సీఈఆర్‌టీతో పాటు ఏ మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేయబోరని తెలిపారు. తమ మద్దతు న్యాయవ్యవస్థకేనని అన్నారు. బాధ్యులు ఎవరూ తప్పించుకోలేరని హామీ ఇచ్చారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి మాత్రం ఈ చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చర్యలతో ఎలాంటి ఫలితం ఉండదని అన్నారు. 'వారు తొలి తూటాను పేల్చారు. న్యాయవ్యవస్థకు గాయమైంది. రక్తం కారుతోంది. దీని వెనుక ఏదో లోతైన కుట్ర ఉన్నట్టు అనిపిస్తోంది. పక్కా ప్లాన్ ప్రకారం చేసినట్టు ఉంది' అని అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ తాజాగా క్షమాపణలు చెప్పిన తీరుపై కూడా చీఫ్ జస్టిస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంలో అనుకోకుండా పొరపాటు జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తన ప్రకటనలో పేర్కొంది. సరైన నిర్ణయం తీసుకోనందుకు విచారిస్తున్నామని వ్యాఖ్యానించింది. అయితే, న్యాయస్థానం మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఆశించిన స్థాయిలో క్షమాపణ లేదని పేర్కొంది. ఈ విషయాన్ని తుషార్ మెహతా ప్రస్తావిస్తూ విచారణ మొదట్లోనే తాము బేషరతుగా క్షమాపణ చెబుతున్నామని అన్నారు. అయితే, ఆయన కామెంట్స్‌తో చీఫ్ జస్టిస్ విభేదించారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రకటనపై మీడియా కథనాలను ఉటంకిస్తూ ఆ ప్రకటనలో క్షమాపణ అన్న పదమే లేదని పెదవి విరిచారు.

ఈ అంశంపై బుధవారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా స్పందించాయి. సంబంధిత పాఠ్యాంశాన్ని తొలగిస్తామని పేర్కొన్నాయి. ఈ పాఠానికి బదులు స్ఫూర్తిమంతమైన ఇతర కథనాలు చేర్చి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాయి.

## బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

**జిల్లాలో 14 ఏళ్ల వయసు కలిగిన వారిని గుర్తించేందుకు సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ సర్వే**

**మరోవైపు విద్యా శాఖ నుంచి కూడా సమాచారం సేకరణ**

**9,634 మంది బాలికలు ఉన్నట్టు గుర్తింపు**

**తల్లి లేదా తండ్రి అనుమతి తప్పనిసరి?**




క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 26 దేశంలో గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్‌ను నియంత్రించేందుకు కేంద్రం నడుం బిగించింది. ఇందులో భాగంగానే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో శనివారం సీఎం చంద్రబాబు నాయుడు ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. తొలుత ఈ వ్యాక్సిన్‌ను 14 ఏళ్లు కలిగిన బాలికలకు అందించాలని కేంద్రం సూచించడంతో ఆ వివరాలు సేకరించే పనిలో ఆరోగ్య శాఖ నిమగ్నమైంది. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 14 ఏళ్ల వయసు కలిగిన బాలికలను గుర్తించేందుకు ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ ఇప్పటికే సర్వేను ప్రారంభించారు. శుక్రవారంతో సర్వే పూర్తి కానుంది. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా సమాచారాన్ని సేకరించారు. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన డేటా ప్రకారం జిల్లాలో 14 ఏళ్ల వయసున్న బాలికలు 9,634 మంది ఉన్నారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించి పూర్తిస్థాయి ఆదేశాలు రావాల్సి ఉందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ తెలిపారు.

ఒకరి సమ్మతి తప్పనిసరి..

తొలుత 14 ఏళ్ల అమ్మాయిలకు మాత్రమే వ్యాక్సిన్ ఇవ్వాలని నిర్ణయించారు. తరువాత దశలో మిగిలిన కేటగిరీలకు చెందిన అమ్మాయిలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్టు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యాక్సిన్ ఇచ్చేందుకు అనుగుణంగా సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కూడా పూర్తిచేశారు. 0.5 ఎంఎల్ వ్యాక్సిన్‌ను ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. మూడు నెలలపాటు దేశంలో ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రానికి సుమారు రెండు లక్షల డోసుల వ్యాక్సిన్ చేరింది. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు ఇంకా సరఫరా కావాల్సి ఉంది. ఒకటి, రెండు రోజుల్లో జిల్లాకు వ్యాక్సిన్ చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలావుంటే వ్యాక్సిన్ తీసుకునే విషయంలో తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతి తప్పనిసరిగా ఉండాలన్న నిబంధనను కేంద్రం పెట్టినట్టు చెబుతున్నారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన వివరాలను యూవిన్ డిజిటల్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు.

## గంజాయిపై ఉక్కుపాదం



క్రైం కౌంటర్ న్యూస్, పార్వతీపురం, ఫిబ్రవరి 26 : జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగంపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పోలీస్ శాఖను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నివారణకు పోలీస్, ఫారెస్ట్, ఎక్సైజ్‌శాఖలు జాయింట్ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. 'బస్సులు, రైల్వేస్టేషన్లలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయాలి. గంజాయి విక్రయించినా, వినియోగించినా బెయిల్ రాకుండా బైండోవర్ కేసులు నమోదు చేయాలి. విద్యా సంస్థల వద్ద ఉన్న దుకాణాలను తనిఖీ చేయాలి. షాపుల్లో మత్తు పదార్థాలు ఉంటే సీజ్ చేయాలి. ప్రతి గ్రామంలో మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలతో డ్రగ్స్ అనర్థాలపై ర్యాలీలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. గంజాయిపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.' అని అన్నారు.

బాల్య వివాహాలు చేస్తే జైలుకే


బాల్య వివాహాలు చేస్తే సంబంధిత తల్లిదండ్రులతో పాటు ఆ గ్రామ సర్పంచ్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం కలెక్టర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను జరిపించే వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ఎవరికైనా తెలిస్తే 1098 లేదా 181 కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆ కార్యక్రమాల వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తే చాలా మందికి అవగాహన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, అదనపు ఎస్పీ మనీషారెడ్డి, పార్వతీపురం పురపాలక శాఖ కమిషనర్ పావని, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## కొడవ సంప్రదాయంలో రష్మిక విజయ్ పెళ్లి.

టాలీవుల్ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. వీరిద్దరి వివాహం గురువారం ఉదయం ఉదయ్ పూర్ లోని ఐటీసీ హోటల్లో జరగింది. ఈ పెళ్లికి సినీప్రముఖులు, సన్నిహితులు హాజరైనట్లు సమాచారం. ఈ పెళ్లికి పూర్తి ప్రైవసీగా నో ఫోన్ పాలసీని సైతం అమలు చేశారు. ఇక మార్చి 4న హైదరాబాద్ లోని తాజ్ కృష్ణలో సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉంటే.. గురువార రష్మిక, విజయ్ మరోసారి పెళ్లి చేసుకోబోతున్నారు. ఉదయం తెలుగు సంప్రదాయంలో వివాహం జరగ్గా.. సాయంత్రం కర్ణాటకలోని కొడవ పద్ధతిలో పెళ్లి చేసుకోకున్నారు. కర్ణాటకలోని కొడగు (కూర్గ్ ) జిల్లాలో జన్మించింది రష్మిక. అక్కడి స్థానిక వారియర్ కమ్యూనిటీనే కొడవగా పిలుస్తారు. ఈ వర్గానికి చెందిన ప్రజల ఇళ్లల్లో పెళ్లిళ్లు ఎలా జరుగుతాయో తెలుసా ? అని సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు నెటిజన్స్.కొడవ ప్రజల సంస్కృతి, ఆహార్యం, వివాహ పద్దతులు ఇతరులతో పోలిస్తే విలక్షణంగా ఉంటాయి. యువతీయువకులు తమ వర్గ సంప్రదాయాలు పాటిస్తూ పూర్వీకులను గౌరవిస్తూ పెళ్లి చేసుకుంటారు. మాములుగా జరిగే హిందూ వివాహాలకు భిన్నంగా కొడవ వెడ్డింగ్ ఉంటుంది. అగ్నిసాక్షిగా ఏడడుగులు నడుస్తూ ప్రమాణాలు చేసుకోవడం వంటిది ఏమీ ఉండదు. సుదీర్ఘంగా పెళ్లి మంత్రాలు వినిపించావు. ఈ ప్రక్రియ మొత్తంలో స్థానికతే కనిపిస్తుంది. అరటి ఆకుల్లో విందు, సంప్రదాయ అలంకరణలు ఈ ప్రత్యేక ఆకర్ణగా నిలిచాయి. ఈ వేడుకలో కుప్పస దుస్తులు, తలపాగ ధరించనున్నారు. యోధ సంప్రదాయానికి చిహ్నంగా పీచే కట్టి అనే కత్తి ధరించడం ముఖ్య ఆచారం. వధువు కోర్గి శైలిలో చీర కట్టడం ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తుంది.కొవడ మహిళలు తమ పైటకొంగును వెనక నుంచి ముందుకు వేస్తారు. ఇక వేడుక అంతా వలగ డ్రమ్ బీట్స్, పాటలతో వారియర్ నేపథ్యాన్ని గుర్తుచేసే నృత్యాలతో ఎలాంటి ఆర్భాటం లేకుండా సందడిగా సాగుతుంది. అలాగే గన్ సెల్యూట్స్ కూడా ఆ వేడుకలో భాగమే. అయితే ఇప్పుడు దానిని అనుసరించడం క్రమంగా తగ్గిపోతుంది. ఈ క్రమంలోనే గతంలో కొడవ పద్దతిలో రష్మిక మంట్లాడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరలవుతుంది.





## మిమ్మల్ని మీరు కాపాడుకోండిలా..

నేటి ఆధునిక కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా గతంలో వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి, ఇప్పుడు యువతను కూడా కలవరపెడుతోంది. అయితే మనం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుని రోగ నిరోధక శక్తిని పెంచే 5 అద్భుతమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

చిలగడదుంపలు

చిలగడదుంపలు కేవలం రుచికరమైనవే కాదు, అద్భుతమైన పోషకాల గని. వీటిలో విటమిన్ ఌా, దీ6, జ తో పాటు బీటా-కెరోటిన్, ఆంథోసైనిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కడుపు, మూత్రపిండాలు, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ముఖ్యంగా ఊదా రంగు చిలగడదుంపల్లో బ్లూబెర్రీస్ కంటే మూడు రెట్లు ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.

మొలకెత్తిన బ్రోకలీ

సాధారణ బ్రోకలీ కంటే మొలకెత్తిన బ్రోకలీ 10 నుండి 100 రెట్లు ఎక్కువ పోషకాలను కలిగి ఉంటుంది. ఇందులో సల్ఫోరాఫేన్ అనే రసాయనం ఉంటుంది. ఇది కణితులకు రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, రొమ్ము మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తుంది.గ్రీన్ టీ

ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల శరీరానికి రక్షణ కవచం లభిస్తుంది. ఇందులో ఎపిగాల్లోకాటెచిన్-3-గాలెట్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ రాడికల్స్ అనే టాక్సిన్లను నాశనం చేస్తుంది. క్యాన్సర్ కణాలు ఇతర అవయవాలకు వ్యాపించకుండా అడ్డుకుంటుంది.

బీన్స్

అధిక ఫైబర్, ప్రోటీన్ కావాలనుకునే వారికి బీన్స్ ఉత్తమ ఎంపిక. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. క్రమం తప్పకుండా బీన్స్ తీసుకునే వారిలో రొమ్ము క్యాన్సర్ ప్రమాదం 28శాతం వరకు తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించడంలో ఇవి చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. క్యాన్సర్‌ను పూర్తిగా అడ్డుకోవడం మన చేతుల్లో లేకపోయినా ఈ ఆహారాలను మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు. సరైన ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామమే క్యాన్సర్ నివారణకు తొలి మెట్టు.



## బాత్రూమ్‌లో స్మార్ట్‌ఫోన్ అలవాటు ఉందా?

ప్రస్తుతం డిజిటల్ కాలం నడుస్తుంది. కొనదరికి ఉదయం నిద్ర లేవగానే టీ , కాఫీ తాగే అలవాటు ఉంటుంది. అలా చేయకపోతే వారి దైనందిన దినచర్య లో మలవిసర్జన జరగదు. ఇలాంటి కొందరు సిగరెట్ కాలుస్తూ ఎక్కువ సమయం గడిపితే , మరికొందరు న్యూస్ పేపర్స్ చదువుతూ బాత్రూమ్లో ఎక్కువ సేపు ఉంటారు. అయితే, ఇప్పుడు ఇలాంటి వారితో పాటు టాయిలెట్‌కు వెళ్లినప్పుడు కూడా సోషల్ మీడియా (స్క్రోల్ చేయడం లేదా వీడియోలు చూడడం చాలా మందికి అలవాటైపోయింది. ఇది సాధారణంగా కనిపించినా, ఈ అలవాటు రాను రాను ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుందని ఇపుణులు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అమెరికాలోని ఒక వైద్య పరిశోధనా సంస్థ చేసిన తాజా అధ్యయనంలో, టాయిలెట్‌లో ఎక్కువసేపు స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే వారికి పైల్స్ (బవాసీర్) వచ్చే ప్రమాదం, ఫోన్ ఉపయోగించని వారితో పోలిస్తే సుమారు 46 శాతం ఎక్కువగా ఉంటుందని వెల్లడైంది. ఈ పరిశోధన 'సైంటిఫిక్ జర్నల్'లో ప్రచురించబడింది. వైద్యపరంగా పైల్స్ ను హేమరాయిడ్స్ అని అంటారు. ఇది మలద్వార ప్రాంతంలోని నరాలు ఉబ్బిపోవడం వల్ల కలిగే సమస్య. దీని కారణంగా నొప్పి, రక్తస్రావం వంటి సమస్యలు తలెత్తవచ్చు. దీర్ఘకాలం టాయిలెట్‌లో కూర్చోవడం పైల్స్‌కు ముఖ్య కారణాల్లో ఒకటిగా గుర్తించారు. పరిశోధకులు చెబుతున్న దాని ప్రకారం, టాయిలెట్‌లో కూర్చొని మొబైల్‌లో వీడియోలు చూడటం లేదా సోషల్ మీడియాలో గడపడం వల్ల సమయం ఎలా గడిచిపోతుందో తెలియదు. ఇలాంటి వారు అజ్ఞాతంగా ఎక్కువ సమయం గడుపుతున్నారట. వీరు తమకు తెలియకుండానే ఎక్కువసేపు కూర్చోవడం జరుగుతుంది. దీని వలన మలద్వార ప్రాంతంలోని నరాలపై ఒత్తిడి పెరిగి పైల్స్ సమస్య తలెత్తే అవకాశం అధికంగా ఉందని నిపుణులు చెబుతున్నారు.స్మార్ట్‌ఫోన్ ప్రతి ఒక్కరి రోజువారీ జీవితంలో ఒక ముఖ్య భాగంగా మారిపోయింది. ఉదయం లేవగానే, తినేటప్పుడు, ఖాళీ సమయంలో కూడా ఫోన్ ఉపయోగించడం సాధారణమైంది. ఈ క్రమంలో జరిగిన అధ్యయనంలో భాగంగా 125 మంది రోగులను పరిశీలించారు. వీరిలో కొంతమంది కోలోనోస్కోపీ కోసం వచ్చినవారు ఉన్నారు. పరిశోధనలో వీరు టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల పైల్స్ ఉందని గుర్తించారు. కోలోనోస్కోపీ అనేది పెద్ద ప్రేగు (కోలోన్) మరియు మలద్వారం లోపలి భాగాన్ని పరీక్షించే వైద్య పరీక్ష. దినిబారిన పడకుండా ఉండాలంటే నిపుణుల సూచనల ప్రకారం టాయిలెట్‌లో అవసరమైనంత సమయం మాత్రమే గడపాలి. అదేవిధంగా మొబైల్ ఫోన్‌ను టాయిలెట్‌కు తీసుకెళ్లకుండా ఉండటం మంచిది. ఇలాంటి సమస్యతో బాధ పడుతున్నవారు ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం, ఎక్కువ నీరు త్రాగడం మంచిదని నియమిత వ్యాయామం చేయడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

## చెత్త రికార్డులో అభిషేక్..

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 దశలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌కు ముందు టీమిండియాకు అతిపెద్ద తలనొప్పి అభిషేక్ శర్మ ఫామ్‌నే. ప్రపంచ నంబర్-1 టీ20ఐ బ్యాట్స్‌మన్‌గా టోర్నీలోకి అడుగుపెట్టిన అభిషేక్, మొదటి మూడు మ్యాచ్‌ల్లో వరుసగా మూడు డక్స్‌తో తీవ్ర నిరాశపరిచాడు. యునైటెడ్ స్టేట్స్‌తో మ్యాచ్‌లో డక్‌తో ఖాతా తెరిచిన అభిషేక్, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌ల్లో కూడా సున్నాకే ఔట్ అయ్యాడు. దీంతో అతని ఆత్మవిశ్వాసం పూర్తిగా దిగజారింది. సూపర్-8లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఖాతా తెరిచినప్పటికీ కేవలం 15 పరుగులకే పరిమితమయ్యాడు.26 బంతుల్లో అర్ధ సెంచరీ చేసినా చేదు రికార్డు..

జింబాబ్వే బౌలర్లు అభిషేక్ శర్మను కట్టడి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో బరిలోకి దిగారు. మొదట్లో నెమ్మదిగా ఆడిన అభిషేక్, తొలి బౌండరీ తర్వాత పూర్తిగా గేర్ మార్చాడు. చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో 26 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసి అభిమానులను ఉత్సాహపరిచాడు.

అయితే ఇది అతనికి ఒక చేదు రికార్డుగా కూడా మారింది. టీ20 ఫార్మాట్‌లో అతని రెండో అత్యంత నెమ్మదైన అర్ధ సెంచరీ ఇదే (26 బంతుల్లో 50). ఆసక్తికరంగా, అతని అత్యంత స్లో ఫిఫ్టీ కూడా జింబాబ్వేపైనే నమోదైంది. 2024లో హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో 33 బంతుల్లో 50 పరుగులు చేసి అప్పటివరకు అతని కెరీర్‌లో అత్యంత నెమ్మదైన ఫిఫ్టీగా నిలిచింది.

అంటే అభిషేక్ శర్మకు జింబాబ్వేపై చేసిన రెండు అర్ధ సెంచరీలే అతని కెరీర్‌లో అత్యంత నెమ్మదైన ఫిఫ్టీలు కావడం విశేషం. అయినప్పటికీ, వరుసగా విఫలమైన తర్వాత వచ్చిన ఈ ఇన్నింగ్స్ అతనికి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి తీసుకొచ్చే కమ్‌బ్యాక్‌గా మారింది.

ఈ ప్రదర్శనతో అభిషేక్ మళ్లీ తన పాత ఫామ్‌లోకి వస్తాడని టీమిండియా ఆశిస్తోంది. సూపర్-8లో మిగిలిన మ్యాచ్‌ల్లో అతని బ్యాటింగ్ భారత్‌కు కీలకంగా మారనుంది.



## ఆ రికార్డును బద్దలు కొట్టిన అభిషేక్ శర్మ, సంజూ జోడీ..

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ జింబాబ్వేతో జరిగిన కీలక మ్యాచ్‌లో అదిరిపోయే ఆరంభం చేసింది. ఓపెనర్లుగా బరిలోకి దిగిన సంజూ శాంసన్ - అభిషేక్ శర్మ జోడీ ఓపెనింగ్ వికెట్‌కు కొత్త రికార్డు నెలకొల్పింది. ఈ టోర్నీలో తొలిసారిగా భారత ఓపెనర్లు ఇంత దూకుడుగా బ్యాటింగ్ చేసి భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.

ఇండియా ఒం జింబాబ్వే మ్యాచ్‌లో సంజూ శాంసన్ - అభిషేక్ శర్మల మధ్య 48 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఇది టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ తరఫున ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్. టోర్నీలో ముందుగా ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో భారత ఓపెనర్లు ఇంత స్కోర్ కూడా సాధించలేకపోయారు. ఈ భాగస్వామ్యంతో పవర్‌ప్లేలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది.

సంజూ - అభిషేక్‌ల అత్యుత్తమ ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్..

జింబాబ్వేతో మ్యాచ్‌లో 23 బంతుల్లో 48 పరుగులు జోడించారు. ఇందులో సంజూ శాంసన్ 15 బంతుల్లో 24 పరుగులు చేయగా, అభిషేక్ శర్మ 8 బంతుల్లో 17 పరుగులు చేశాడు. ముజరబానీ బౌలింగ్‌లో సంజూ ఔట్ కావడంతో ఈ ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది.27వ పరుగుకే రికార్డు బ్రేక్..

ఈ భాగస్వామ్యం మొత్తం 48 పరుగులకు చేరుకున్నప్పటికీ, 27వ పరుగుకే ఈ టోర్నీలో భారత్‌కు ఉన్న గత ఓపెనింగ్ రికార్డును దాటేశారు. అంటే ఇప్పటివరకు భారత ఓపెనింగ్ జోడీ ఎంతగా విఫలమైందో ఈ ఒక్క మ్యాచ్ స్పష్టంగా చూపించింది.

గత ఐదు మ్యాచ్‌ల కంటే భారీగా జింబాబ్వేపై ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్

ఈ జింబాబ్వే మ్యాచ్‌లో వచ్చిన 48 పరుగుల ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్, భారత్ గత ఐదు మ్యాచ్‌లలో ఓపెనర్లు చేసిన మొత్తం పరుగుల కంటే ఎక్కువ. గత ఐదు మ్యాచ్‌ల్లో భారత ఓపెనర్లు కలిపి కేవలం 34 పరుగులు మాత్రమే జోడించారు.

అభిషేక్ శర్మలో కనిపించిన మార్పు..

సంజూ శాంసన్ ఔట్ అయిన తర్వాత కూడా అభిషేక్ శర్మ క్రీజ్‌పై నిలబడి నిలకడగా ఆడాడు. గత నాలుగు ఇన్నింగ్స్‌లో కనిపించిన అభిషేక్ కంటే జింబాబ్వే మ్యాచ్‌లో పూర్తిగా భిన్నంగా కనిపించాడు. ఆ తర్వాత ఈశాన్ కిషన్‌తో కలిసి అభిషేక్ పవర్‌ప్లేలోనే భారత్ స్కోరును 80 పరుగుల వరకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాడు.

ఈ ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ తిరిగి తన పాత ఫామ్‌ను అందుకుంటున్నాడని అభిమానులు ఆశిస్తున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com